క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ప్రశాంత జీవనం గడపాలని.. గొడవల్లో తల దూర్చి ఇబ్బందులు తెచ్చుకోవద్దని సీఐ డి. వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ రమేష్ బాబుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. నాటు సారా, అక్రమ మద్యం, పేకాట, మాట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో చేసిన తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేకుంటే జైలు జీవితం తప్పదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం



ప్లాంట్‌ను పున:ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉన్న ఎన్టీఆర్ సుజల మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాంట్‌కు రూ.4లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించామని తెలిపారు. మండంలోని అన్ని గ్రామాలకు త్వరలోనే మినరల్ వాటర్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్యాంక్‌లు మరమ్మతులకు గురయ్యాయని అధికారులు చెప్పారని.. వాటి కోసం రూ.5లక్షలు ఖర్చవుతుందని.. రెండు వారాల్లో పునరుద్ధరించే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అల్లూరు, కొత్తపల్లె గ్రామాల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవకులు

డోన్ టౌన్: వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదివారం స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఇందుకు దాతలు రేవన్‌గౌడ్, కటారుకొండ వనజాక్షి, రమణ ఆర్థిక సహాయం చేశారు. అలాగే కర్నూలుకు చెందిన శాంతి ఆర్థిక సాయంతో పట్టణ సమీపంలోని పద్మావతి వృద్ధాశ్రమంతో పాటు ఓబులాపురం సమీపంలోని కాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు మధు, మోహన్‌రెడ్డి, ఆటో మౌలాలి, శ్రీను, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓను సస్పెండ్ చేయాలి

డోన్ టౌన్: ముడుపులు తీసుకుని ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేసి అక్రమాలకు పాల్పడిన వీఆర్‌ఓ మల్లారెడ్డిని సస్పెండ్ చేయాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెందిన చుక్కల భూములను దొంగదారిన రెవెన్యూ రికార్డులు సృష్టించి అప్పనంగా అక్రమదారులకు అప్పజెప్పిన మల్లారెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఉడుములపాడు, వెంకటనాయునిపల్లె వీఆర్‌ఓగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. సీఐటీయూ నాయకులు చిన్న రహిమాన్, డీవైఎఫ్‌ఐ నాయకుడు నక్కిహరి తదితరులు ఉన్నారు.

స్పందనకు స్వస్తి

- గ్రామ సచివాలయాల్లో స్పందనకు చెల్లుచీటి
- గత్యంతరం లేక మండల కేంద్రానికి వెళ్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

అవుకు: సమస్యల పరిష్కారానికి ప్రజలు మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో వెళ్లాల్సిన అవసరం లేకుండా పరిపాలన సౌలభ్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల పరిధిలో రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించేది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు పంచాయతీ కార్యదర్శితోపాటు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేవారు. గ్రామంలోనే స్పందన ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ప్రయాణభారం, రవాణా చార్జీలు, సమయం వృథా కాకుండా ఉండేది. మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యేవి.

కూటమి ప్రభుత్వం రాకతో మారిన పరిస్థితులు

అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సచివాలయాల్లో ఎక్కడా ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న దాఖలాలు కనిపించడంలేదు. గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించకపోవడంతో ప్రజలు మండల స్థాయి, జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. అది కూడా వారంలో కేవలం సోమవారం రోజు మాత్రమే ఉండడంతో అర్జీదారులు పనులు మానుకుని వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు

గ్రామాల్లో స్పందన కార్యక్రమం లేకపోవడంతో మండల కేంద్రం, జిల్లా కేంద్రానికి వెళ్లలేక కొందరు మిన్నకుండిపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళల పరిస్థితి కష్టంగా మారింది. ఇంట్లో పనులు చేసుకుని వెళ్లే తీరిక లేక సమస్యల మధ్యే సతమతమవుతున్నారు. మరో వైపు వేసవి కావడంతో ఎండకు వెళ్లలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు గ్రామాల్లోని సమస్యలను ఎవరికి చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి.



చెర్లోపల్లె గ్రామ సచివాలయం

నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాల సంఖ్య
బనగానపల్లె	25
అవుకు	18
కోవెలకుంట్ల	12
కొలిమిగుండ్ల	16
సంజామల	11

సచివాలయాల్లో స్పందన లేదు



గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదు. కేవలం మండల కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్నాం. అది కూడా ప్రతి సోమవారం జరుగుతుంది. అర్జీదారులు ఎవరైనా సరే ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలో అర్జీలను సమర్పించవచ్చు.

–వెంగన్న, ఎంపీడీఓ, అవుకు

స్పందన కొనసాగించాలి



ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించాలి. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని కొనసాగించేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

–మంచాల నాగేశ్వర రెడ్డి, సుంకేసుల, అవుకు

మహిళలు, వృద్ధులకు కష్టం



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలంటే సరైన రహదారి లేదు. సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే కార్యక్రమానికి రావాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రానుపోనూ బస్సు చార్జీలు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రజకు ఇబ్బంది కలగకుండా గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుంది.

–కంబగిరి రాముడు, మద్రికుంట తండా, అవుకు

నేడు ప్యాపిలిలో వేలం పాట

ప్యాపిలి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండ్, మాంసపు మార్కెట్‌కు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ. 8 లక్షలు డిపాజిట్‌గా చెల్లించాలన్నారు. వేలం ముగిసిన తర్వాత హెచ్చు పాటాదారు పాట దక్కించుకున్న మొత్తంతో పాటు అదనంగా 3 శాతం స్టాంప్ డ్యూటీ కింద చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వినతుల స్వీకరణ

బనగానపల్లె రూరల్: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండలం నుంచే కాకుండా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

జ్యోతి మహోత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న జ్యోతి మహోత్సవాలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీపీ కుమార్‌రెడ్డి మంత్రిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రి చేతుల మీదుగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జ్యోతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

గుండెకు భరోసా

- స్టెమీ ప్రాజెక్టును 2023లో ప్రారంభించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- తగ్గిన గుండెపోటు మరణాలు
- బనగానపల్లె ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో 24 మందికి టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్

బనగానపల్లె: గుండెపోటు కేసుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ఏ మాత్రం అలస్యం చేసినా పేషెంట్ ప్రాణాలకే ముప్పువాటిల్లుతుంది. గుండెపోటు వచ్చిన బాధితుల్లో ఎక్కువ శాతం ఆస్పత్రికి చేరేలోపే ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. కొన్ని కేసుల్లో 90 శాతం ఆస్పత్రిలో చేరిన తరువాత కూడా మరణించిన సంఘటనలు ఉన్నాయి. గుండెపోటు వచ్చిన గంటలోపు ఆస్పత్రిలో చేరితే ప్రాణాలను కాపాడుకోవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో గుండెపోటుకు స్థానిక వైద్యశాలల్లో అత్యవసర చికిత్స అందేదికాదు. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ, ప్రైవేట్ వైద్యశాలల్లో మాత్రమే చికిత్స అందించేవారు. ఇక్కడ పరీక్షలు, మందుల ఖర్చులను పక్కన పెడితే కేవలం ఇంజెక్షన్ ఖరీదే రూ.45వేల నుంచి రూ.50వేల వరకు ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో గుండెజబ్బు బాధితులకు ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స లేక, ఖర్చుల భయంతో ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లలేక పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

గత వైఎస్సార్‌సీపీ పాలనలో..

గుండెకు సంబంధించిన వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాలను తగ్గించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2023 సెప్టెంబర్ 23న స్టెమీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంటలో అత్యవసర చికిత్స అందించి ప్రాణాలను కాపాడడమే ఈ స్టెమీ ప్రాజెక్టు లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా గుండెపోటుకు గురై మరణించేవారి సంఖ్య పెరుగుతుండడంతో కార్డియాలజీ సేవలు మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేయాలని భావించిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్ర ప్రభుత్వ వైద్యశాలల్లో ఈ చికిత్స అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. గుండెపోటు వచ్చిన బాధితుడికి సుమారు 40 నిమిషాల సమయంలో అవసరమైన చికిత్స అందించి ప్రాణాలను రక్షించమే స్టెమీ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గోల్డెన్ అవర్‌లో ప్రాణప్రాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన రోగికి సుమారు రూ.45 వేల ఇంజెక్షన్ ఉచితంగా ఇవ్వడంతో పాటు జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు బాధితుడికి తరలించి చికిత్స అందించే ఏర్పాట్లు చేసింది.

ఇప్పటి వరకు 24 మందికి ఇంజెక్షన్

బనగానపల్లె ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో స్టెమీ ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 24 మంది గుండెజబ్బు బాధితులకు రూ.45 వేల ఇంజెక్షన్ టెనెక్ట్‌ప్లస్ ఇచ్చారు. బాధితులంతా అత్యవసర పరిస్థితుల్లో వైద్యశాలకు వచ్చినవారే. వీరంతా ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు.



బనగానపల్లె కమ్యూనిటీ వైద్యశాల



వైద్యశాలలో గుండె వ్యాధికి సంబంధించిన ఇంజెక్షన్ వేస్తున్న వైద్యుడు

సద్వినియోగం చేసుకోండి



గుండెపోటు లక్షణాలు కనిపిస్తే మొదటి గంటలోపే బనగానపల్లె ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు చేరుకోవాలి. సీహెచ్‌సీలో గుండెపోటు బాధితులకు ఉచితంగా రూ.45 వేల విలువైన ఇంజెక్షన్ అందుబాటులో ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఇంజెక్షన్ ప్రాణాలను రక్షించగలుగుతుంది.

–డాక్టర్ సుజాత, సూపరింటెండెంట్, బనగానపల్లె సీహెచ్‌సీ

నేటి నుంచి 'పది' పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 280 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఆయా కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లుగా రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుందరయ్య, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా ఇల్లూరు, కొత్తపేట జెడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు మల్లికార్జున, పాండురంగారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

బనగానపల్లె రూరల్: మండలంలో నేటి (సోమవారం) నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో 1,640 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందులో నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 200 మంది, విజయానికేతన్‌లో 120, బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 280, జెడ్పీ బాలికల పాఠశాలలో 220, శ్రీధాత్రిలో 200, ఎస్‌వీ చైతన్యలో 200, ప్రియదర్శినిలో 200, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు అర గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

పేదవాడి ఫ్రిడ్జ్‌కి భలే గిరాకీ..!



విక్రయాలకు ఉంచిన వివిధ రకాల మట్టికుండలు

బేతంచెర్ల: ఎండకాలం వచ్చిందంటే వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి నీరు తాగుతుంటారు. పేద వాడి ఫ్రిడ్జిగా చెప్పుకునే మట్టి కుండలు, మట్టి పాత్రలు బేతంచెర్ల పట్టణ ప్రజలను ఆకర్షిస్తున్నాయి. మారుతున్న కాలనుగుణంగా మన ప్రాంతంలో తయారయ్యే మట్టి కుండలతోపాటు రాజస్థాన్ నుంచి తెచ్చిన మట్టి కుండలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. మన ప్రాంతం మట్టి కుండలు సైజును బట్టి రూ.100 నుంచి రూ.200 వరకు, రాజస్థాన్ మట్టి కుండలు రూ. 400 వరకు ఉన్నాయి. కుండలతో పాటు మట్టి పాత్రలు, నీళ్ల బాటిల్, ప్రెషర్ కుక్కర్ లాంటి పాత్రలతో పాటు మట్టి హుండీలను అందుబాటులో ఉంచారు.

అమరజీవికి ఘన నివాళి



బనగానపల్లె: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బనగానపల్లె రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం బనగానపల్లె పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఆ సంఘం అధ్యక్షుడు గాథంశెట్టి వేణుగోపాల్‌శెట్టి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా పాత బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌కు వెళ్లారు. అక్కడున్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన పోరాటాలను, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు శ్రీరామవెంకటసుబ్రమణ్యం, గుండా శ్రీనివాసులు, జంగంశెట్టి, నూకల విజయుడు, జక్కా నాగరాజు, భరతుడు, శివరాజ్, బలరామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు.



బేతంచెర్లలో..

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

బేతంచెర్ల: భాష ప్రయుక్త రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఆంధ్ర ప్రజల హృదయాల్లో అమరజీవిగా పొట్టి శ్రీరాములు నిలిచిపోయారని ఆర్యవైశ్యులు సుబ్రమణ్యం, రామ్మూర్తి, కల్కి సతీష్ అన్నారు. ఆదివారం బేతంచెర్లలోని అమ్మవారిశాలలో వాసవీ వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, రమణ, ఇందుమతి, శ్రీవిద్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్యవైశ్యులు అర్వేటి శేఖరయ్య, గుప్త, లక్ష్మీనారాయణ, నగేష్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

డోన్ టౌన్: నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కమిటీ సభ్యులు శివరామ్, రామాంజనేయులు, నక్కి హరి డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం కొండపేటలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను గాలికి వదిలేసి ఉన్న సంక్షేమ ఫథకాలను కూడా తొలగిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు కుల్లాయప్ప, సుధాకర్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.



నాడు వ్యాపారులు లేక వెలవెల



నేడు వ్యాపారులతో సంత మార్కెట్ షెడ్డు కళకళ

ఎట్టకేలకు సంతమార్కెట్‌లో వ్యాపారాలు

సాక్షి ఎఫెక్ట్

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేటలో రూ.45 లక్షలతో నిర్మించిన సంతమార్కెట్ షెడ్డులో ఎట్టకేలకు వ్యాపారాలు ప్రారంభమయ్యాయి. గతంలో షెడ్డులో కాకుండా రహదారికి ఇరువైపులా వ్యాపారాలు నిర్వహించేవారు. వాహనదారులకు ఇబ్బందిగా ఉండేది. సంతమార్కెట్‌కు గ్రహణం శీర్షికతో గత నెల సాక్షిలో ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. సంతమార్కెట్ షెడ్డులో వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో ఆదివారం సంత మార్కెట్ షెడ్డు వ్యాపారులు, ప్రజలతో కళకళలాడింది.

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు ఆదివారం పరిసమాప్తం అయ్యాయి. చివరి ఘట్టమైన ధ్వజావరోహణం ఆదివారం తెల్లవారుజామున ఆగమోక్తంగా జరిగింది. ఉత్సవాల మొదటి రోజు ధ్వజారోహణ సందర్భంగా సకల దేవతలను ఆహ్వానించిన గరుడాళ్వార్ తిరిగి పంపే కార్యక్రమం శాస్త్రకంగా జరిగింది. ఉత్సవ మూర్తులు స్వామి, అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకించి, తిరుమంజన సేవ గావించిన అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్దకు వేంచేశాక ముద్రక్త ఆఘమశాస్త్రం ప్రకారం వేదమంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. అనంతరం ముద్రకర్త కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో అర్చకులు గరుడధ్యానం, భేరీపూజ, గరుడ గద్యం, దిక్పాలక గద్యం, గరుడ లగ్నాష్టకం, గరుడ చూర్ణిక మంత్రాలను జపించి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వేదపారాయణం ద్వారా ప్రకటించారు.

ప్రశాంతం... బ్రహ్మోత్సవం

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 3వ తేదీ మొదలైన ఉత్సవాలకు మొదట్లో భక్తులు పెద్దగా కనిపించకపోవడంతో చివరి ఘట్టాలైన రథోత్సవం, కల్యాణోత్సవం, గరుడ సేవకు భారీగా వస్తారని అంచనా వేసినా మాడవీధుల్లో భక్తులు కనిపించారే తప్ప కిక్కిరిసిపోలేదు. ఆయల అధికారులు సామాన్య భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. పోలీసులు వీఐపీల దర్శనం కోసం అడుగడునా సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారన్న విమర్శలు మెండుగా వినిపించాయి. కల్యాణం రోజు భక్తులను ఎవరినీ లోపలకు పంపకుండా కేవలం వీఐపీలను మాత్రమే కూర్చోబెట్టి సామన్య భక్తలును అందరినీ ఎల్‌ఈడీ టీవీల్లో చూడాలని ఆదేశించడంపై భక్తులు మండిపడ్డారు.



గరుత్మంతుడిపై ప్రహ్లాదవరదుడు

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి



బోంచెర్వుపల్లిలో ట్యాంకర్ వద్ద పోటీపడి నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల, బోంచెర్వుపల్లి గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజులుగా రెండు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రాచర్లకు రోజుకు 8 ట్రిప్పులు, బోంచెర్వుపల్లి గ్రామానికి రోజుకు 4 ట్రిప్పుల చొప్పున ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. నీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో అవసరమైన పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అద్దె భవనంలో పశువైద్యశాల

ప్యాపిలి: మండల కేంద్రంలోని పశువైద్యశాలకు సొంత భవనం కరువైంది. గతంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న పశువైద్యశాలను షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసంకూల్చేశారు. అప్పటి నుంచి ఓ ప్రైవేటు భవనంలోనే నిర్వహిస్తున్నారు. నెలకు రూ. 6 వేల చొప్పున గ్రామ పంచాయతీ ద్వారానే అద్దె చెల్లిస్తున్నారు. అద్దె చెల్లించడం గ్రామ పంచాయతీకి భారంగా మారింది. పశువైద్యశాల భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీకి చెందిన 6 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అయితే ఇప్పటికీ కొత్త భవనం మంజూరు కాలేదు. దీంతో ఏమాత్రం సౌకర్యాలు లేని అద్దె భవనంలోనే పశువైద్యశాలను నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే పశుసంవర్ధక శాఖ ఏడీ కూడా విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి కొత్త పశువైద్యశాలకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న పశువైద్యశాల